ఒకప్పుడు అదో మారుమూల పల్లెటూరు. ఇప్పుడు నగరమైపోతూ నాగరికత పూసేసుకుంటున్నది. శ్రీ వేంకటేశ్వరా టాకీసు ఉంది. శ్రీ వేంకటేశ్వర వైన్సు (టోకు, చిల్లర) ఉంది. శ్రీ వేంకటేశ్వర శాకాహార, మాంసాహార భోజన కాఫీ ఫలహారశాల ఉంది. తిండి కావాలి. ఉంది. గది కావాలి.ఉంది. సరదా ఉంది.

అది మా సత్యనారాయణ మావగారి గ్రామం. మావయ్య చచ్చిపోయి రెండు సంవత్సరాలయింది. ఆయన మా ఊరు వస్తూ ఉండడమే కాని మేం ఎప్పుడూ వాళ్ళ ఊరు వెళ్లలేదు.

# లాడ్జింగు హౌసు

## చాగంటి సోమయాజులు

అప్పుడూ అప్పుడూ మా నాన్న వెళ్లడం ఉంది. మావయ్య కుటుంబ సమేతంగా రావడం నాకు జ్ఞాపకం. సీతని వెంట పెట్టుకుని చచ్చిపోయే ముందు దాకా పాపం మా ఇంటికి వస్తూనే ఉన్నాడు.

నేను తిన్నగా వెళ్లి వాళ్లింట్లో దిగడమే న్యాయం. కాని లాడ్జింగు హౌసుకే వెళ్లాను. గది కావాలని అనగానే చాకులాంటి కుర్రాడు చేతిలో బేగు తీసుకున్నాడు.

''పదండి సార్'' అని మేడ మీదికి తీసుకెళ్లి తాళం తీసి గదిలో ప్రవేశపెట్టాడు. ఫాను స్విచ్చి వేశాడు. పెద్ద పెద్ద పట్నాల కన్నా గది బాగా నయం. క్లీనుగా తుడిచి ఉంది. అతి ఖరీదైన మంచం, అతి ఖరీదైన పరుపు, తలగడా ఉన్నాయి.

గదిలోనే కుడి పక్కకి బాత్రూం, లావెట్రీ ఉన్నాయి. ఎదురుగా విశాలంగా పెద్ద కిటికీ ముచ్చటగా ఉంది. కొబ్బరి చెట్ల తలకాయలు కాయలతో అందంగా కనపడుతున్నాయి. మారుమూల ఊరైనా అత్యాధునికంగా కట్టాలని కట్టిన





లాడ్జింగు హౌసులో గది.

కుర్రవాడు నిక్కరూ బుష్‌కోటూ కొద్దిగా మాసినా నీటుగానే ఉన్నాడు.

''టిఫిను తెమ్మన్నారా సార్?'' అన్నాడు.

''కాఫీ తే'' అన్నాను.

కప్పూ మరోకప్పూ మరోకప్పూ పడుతూ ఉండాలి. వాడు కిందికి వెళ్లి గిరుక్కుని కాఫీతో వచ్చాడు.

''స్నానం చేస్తారా సార్?'' అన్నాడు.

''చెయ్యాలి'' అన్నాను.

''వేన్నీళ్ల బకెట్టు తెస్తాను'' అన్నాడు.

''తే!'' అన్నాను.

చలి ప్రవేశించింది. దీపావళి వెళ్లి కొద్ది రోజులయింది. కుర్రవాడు చాలా పెద్ద సైజు బాల్చీతో వేన్నీళ్లు పట్టుకొచ్చి బాత్‌లో పెట్టేశాడు. మీదని ఫాను తిరుగుతూనే ఉంది. ఇబ్బంది లేని చిరు చలి వేస్తూ ఫాను బాగుంది.

''ఎమ్మెల్లే గారిని చూస్తారా సార్?'' అన్నాడు.

''ఆయన అవసరం లేదు'' అన్నాను.

''పోనియ్యండి సార్. ఇంతకీ ఆయన ఊర్లో లేరు. అడిగితే మంచిదని అడిగాను.''

అక్కడో ఎమ్మెల్లేగారు ఉన్నారు! వారి కోసం జనం వస్తూ ఉంటారన్నమాట.

''రాత్రికి ఉంటారా సార్?'' అంటూ ప్రశ్నించాడు.

''ఉంటాను''.

''మీక్కేం కావాల్సినా బటన్ నొక్కండి సార్. నేనిక్కడే ఉంటాను. నా పేరు రామం'' అన్నాడు.

ఓహో రామం! ఇక్కడే ఉంటాడు. రాత్రికి నేనుంటానో లేదో కనుక్కున్నాడు. రాత్రికి లాడ్జింగుకు వచ్చే మహాజనులలో నన్నూ కలిపేసుకున్నాడు.

''రామం! ఈ ఊర్లో పెద్ద గడప వారని ఉన్నారు. వాళ్ల ఇల్లు ఎక్కడో తెలుసా?''

''తెలుసు సార్! దగ్గరే. పక్కవీధిలోంచి వెళ్తే కుడి పక్క పాత పెంకుటిల్లు.''

పెద్ద గడప సత్యనారాయణగారని ఉండే వారు''

వెంటనే వాడు అందుకొని, ''అవునుసార్! చచ్చిపోయారు. వారి పెళ్లామూ నలుగురు కూతుళ్లూ ఉన్నారు. తీసుకు వెళ్లనా సార్?'' అన్నాడు.

''ఇప్పుడొద్దులే'' అన్నాను.

సత్యనారాయణ మావయ్యకి కొడుకులు

లేరు. నలుగురు కూతుళ్లు. సీత, దమయంతి, సావిత్రి, అనసూయ అని పేర్లు పెట్టుకున్నాడు. అందులో పెద్ద కూతురు సీత మహా అందగత్తె మూడోది సావిత్రి చెప్పుకోదగ్గ అందమైనదే అంటారు. సీతని నేను బాగా ఎరుగుదును కదా! దేశంలో నాలుగైదు పెద్ద పట్నాలు గాలిస్తే మరో సీతంత అందమైనదాన్ని చూడ్డం కష్టమే. అంతా హైస్కూలు చదువులు పూర్తి చేసి అక్కడే ఆగిపోయారు.

సీతని వెంటపెట్టుకొని సత్యనారాయణ మావయ్య మా ఇంటికి వస్తూనే ఉండేవాడు. మా అమ్మతో నాన్నతో సీతని మీ ఇంటి కోడలు చేసుకోవాలని నా ఎదురుగానే అంటూ ఉండే వాడు. మా అమ్మా నాన్న తప్పకుండా చేసుకుం టాం. మహాలక్ష్మిలాంటి పిల్ల అంటూ ఉండే వారు. చిన్నప్పట్నించి నేనూ ఇష్టంతో ముచ్చట పడుతూ ఉండేవాణ్ణి. ఇప్పుడు సీతని నేను "పెళ్లి కూతురు"గా చూడ్డానికే వచ్చింది! సత్యనారాయణ మావయ్య చచ్చిపోయాక ఆయన భార్య రావయ్యమ్మ అత్తయ్య మా ఇంటికి రాలేదు. ఈ పెళ్లి విషయం ఎత్తలేదు.

తప్పు మాదే. పాపం ఏం వస్తుందీ? అమ్మా నాన్నా పరామర్శ చెయ్యడానికి వెళ్లలేదు. మావయ్య చచ్చిపోయాక మా అంత వాళ్లతో సంబంధం తలపెట్టడం ఆవిడ తలకి మించినది అని కూడా అనుకుందేమో!

మేమేవీ ఆవిడ దగ్గర కోరుకోవడం లేదనీ, పిల్లని తప్పకుండా చేసుకుంటావనీ ఆవిడకి తెలియడానికి ఎక్కడా సావకాశం లేదు. మా నాన్న కాస్త గణించాడు. నేనూ కాస్త గణించు కుంటున్నాను. అతి అపురూపమైన పిల్ల చేసుకుందామనే నిశ్చయించుకున్నాను. అందు చేత అమ్మా నాన్నా అనుమతితోనే ముందు నాకు నేను చూడ్డానికి వచ్చాను.

మా అమ్మ మాత్రం చిన్న మాట అంది: "చేసుకుంటావు బాగానే ఉంది కాని వాళ్లకి ఆస్తిపాస్తులు అట్టేలేవు. మావయ్య చూస్తే చచ్చిపోయాడు. సీతని పెళ్లాడడంతో పాటు అత్తా, ముగ్గురు మరదళ్లూ నీ నెత్తెక్కి పోతారేమో చూసుకో!" అన్నది.

అలాగ్గా జరగొచ్చు. అందుకూ మనస్సులో అంగీకరించుకునే వచ్చాను.

వాళ్లు నన్ను ఎరగరు. సీత నన్నెరుగును. వాళ్లింటికి వెళ్లాను. నాకు నేనే. నేను ఫలానా అని చెప్పుకున్నాను. అప్పుడు రావయమ్మ అత్తయ్య "రా నాయనా! కూచో" అంది. "అభిమానం ఉంది కాబట్టి వచ్చావు" అంది.

"అభిమానం ఉంది కాబట్టే వచ్చాను." అన్నాను ఎదురుగా ఆవిడ ఒకర్తే ఉంది.

"మీ అమ్మాయి లేరీ?" అని అడిగాను.

"సీతా సావిత్రీ ఊరికి వెళ్లారు. మా తమ్ముడు తీసుకు వెళ్లాడు. వారం రోజుల్లో వచ్చేయాలి" అన్నది.

నాకు పెద్ద ఆశాభంగమే అయింది. ఆవిడ నిండుగా ఉంది "అనూ" అంటూ కేకే సింది. అనసూయా దాని వెంట దమయంతీ వచ్చారు. వాళ్లని నేనదే చూడ్డం. పల్లెటూరి పిల్లల్లా లేరు. వేషం పట్నంవాళ్లని మించి ఉంది. మొహాలేం బాగోలేవు. వాళ్ల బుగ్గల్లో వయస్సు బుసబుస మంటున్నది.


"దమయంతి రెండోది. అనసూయ నాలు గోది" అని పరిచయం చేసింది. నేనెవరినో వాళ్లకి చెప్పింది కాదు. అనసూయ లోపలికి వెళ్లిపోయింది. దాని వెంట దమయంతీ వెళ్లి పోయింది.

"మరీ కట్టు బట్టలతో వచ్చావు. రెండు రోజులు ఉండవూ?"

"చూసిపోదామనే వచ్చాను. బేగు హొటేల్లో పెట్టాను."

"మంచివాడివే! తిన్నగా ఇంటికి రావల్సినది. దిక్కుమాలిన హొటేళ్లు వచ్చి ఇంటికి రావాల్సిన వాళ్లు ఇంటికి రావటం లేదు. చుట్టు పక్కల ఊళ్లో మా బంధువులు ఉన్నారా? ఒక్కరు మా ఇంటికి రారు" అన్నది.

"నేను మీ ఇంటికే వచ్చాను కాని నేను మీ ఇంట్లో భోంచెయ్యను" అని పెద్ద అర్థంతోనే అన్నాను నాకు నేను. కతికితే అతకదంటారు. నాకు నమ్మకం లేకపోయినా వాళ్లకి నమ్మకం




ఉంటుంది. ఆవిడకి నా రాక తాత్పర్యం బోధ పడే ఉండాలి. అయినా

"అదేమిటీ? భోంచేసే వెళ్లు" అంది.

"సీతని చూడ్డానికి వచ్చాను. సీత ఊళ్లో లేదు" అన్నాను.

"సమయానికి ఊళ్లో లేదు. చూశావా ఎలా వచ్చిందో!" అన్నది.

"ఇవాళ రేపూ రాదు కూడా!" అన్నాను.

"వెళ్లక వెళ్లక వెళ్లింది. నాలుగు రోజుల పాటు రాదు. నిజమే" అన్నాది.

ఆవిడకి నా మీద నాక్కావల్సిన అభి ప్రాయం లేదు. అది భయంగా కనపడి పోతు న్నాది. నయమే! సీత బాగుంటుంది. చేసుకుం దాం అనుకున్నాను కాని మనస్సంతా దాని మీద పెట్టుకుని పిచ్చెత్తి పోయి లేదు.

"నేను మళ్లా వస్తాను" అని బైట పడ్డాను.

లాడ్జింగుకెళ్లి తలుపు తీస్తూ ఉంటే రామం చకచకా వచ్చాడు. "మీల్సు కేరేజీ తెమ్మ న్నారా?" అన్నాడు.

"హొటలికే పోతే?" అన్నాను.

"అలగా జనం వస్తారు సార్." అన్నాడు.

"అయితే తర్వాత తెద్దువుగాని లే!" అన్నాను.

"పెద్ద గడపవారి ఇంటికి వెళ్లామా సార్?" అన్నాడు.

"వద్దు" అన్నాను.

"బటన్ నొక్కండి సార్ నే నీ పక్కనే ఉంటాను" అని వెళ్లిపోయాడు.

నాకు మతి పోయింది. తలుపు వేసుకుని ఫాను పెట్టుకుని పడుకున్నాను. చిరు చలి శరీరాన్నంతా పట్టుకున్నది. రావయమ్మత్త సిరి ఇంటికి వస్తే మోకాలు అడ్డుపెడుతున్నాదా? నా ఊహకి ఏం అందలేదు.

మెయిలు బస్సు వచ్చినట్టు ఉంది. దిన పత్రికలు దిగాయి. పత్రికలవాళ్లు తెగ అరుస్తు న్నారు. బటను నొక్కితే రామం వచ్చాడు. "కాఫీ తే" అన్నాను. వాడు మేడ మెట్లు అతి తొందరగా దబదబా దిగడం వినపడ్డాది. కాఫీ పట్టుకుని నిశ్శబ్దంగా వచ్చాడేమో వాడు వచ్చి నట్టు తెలీలేదు. వాడి చేతిలో కాఫీ తీసుకుని తాగుతూ ఉంటే "పెద్ద గడపవారింటికి వెళ్లామా అండి?" మళ్లీ అన్నాడు. పదే పదే అంటున్నాడు. పట్టుకుని వదలడం లేదు. "వాళ్లని ఎరుగుదువా?" అని అడిగాను.

"నేన్నెరక్కపోవడం ఏమిటి? ఇద్దరెళ్ళారు ఇద్దరున్నారు" అన్నాడు!!

"ఏ ఊరెళ్లారు?"

"ఎవరు చెప్పగలరు? ఎమ్మెల్లేగారితో వెళ్లారు. సీతమ్మా సావిత్రమ్మా! తిప్పి తిప్పి ఎప్పుడు తీసుకు వస్తాడో. వాళ్ళ మా లాడ్జీలకి రావడం మానేశారు సార్. మా లాడ్జికి గొప్ప నష్టం సార్! ఇప్పుడు ఎమ్మెల్లేగారి చేతిలో ఉన్నారు సార్. తమరు వాళ్ల కోసమే వచ్చారు. దమయంతి, సీతా వస్తారు సార్ ఛీ ఛీ బాగోరు సార్!" అన్నాడు. బోధపడ్డాది. తలతిరిగి పోయింది. రామం స్వేచ్ఛగా మాట్లాడుతున్నాడు. ఆ లాడ్జింగుకు వచ్చేవాళ్ల ఎమ్మెల్లేగారి కోసమో అమ్మాయిల కోసమో వస్తారు. నన్నూ ఒకడిగా అందులో ఖాయపరుచుకున్నాడు.

"సీత ఊళ్లో ఉంటే తేగలవా?" అన్నాను.

"లాభం లేదు సార్! పెద్ద చేతుల్లోకి వెళ్లి పోయారు. తమరు వారే అంటున్నారు, లేకపోతేనా వాళ్లని తలతన్నే వాళ్లున్నారు సార్!" అన్నాడు.

"మీ లాడ్జింగు ఈ పనులు చెయ్యడం మంచిదేనా?" అన్నాను. క్షురవాణ్ణి అంత ప్రశ్న వెయ్యడం తప్పే.

"అలాగంటా రేంటి సార్! లాడ్జింగు పెట్టబట్టే బీదా బిక్కి బతుకుతున్నారు. అమ్మాయి ఉన్నవాళ్ల అన్నం తింటున్నారు సార్" అన్నాడు రామం.

వాడన్నమాట నా ఒక్కడితో అన్నమాటే అయినా పెద్దలందరికీ చెప్పవలసిన మాట. ఈ దేశంలో నిలకడగా ఉన్న నీతి పోయి కొత్త నీతి వ్యాపిస్తున్నది.

"అవినీతి అంటారా?" కాదు. అందరూ అదే చేస్తే అదే "నీతి". విపరీతంగా వ్యాపించి పోతున్నాది. మారుమూల పల్లెటూళ్ల దాకా.

అమ్మాయి ఉన్నవాళ్ల అన్నం తింటున్నారు.

"సీతకన్నా అందమైన అమ్మాయిని తేగలవా?" అన్నాను.

"ఓ", అన్నాడు.

"ఇక్కడికే?" ప్రశ్న వేశాను.

"ఓ!" అన్నాడు

"పోలీసులొస్తే?" అన్నాను.

"ఎలాగొస్తారు సార్! ఎమ్మెల్లేగారున్నారు. పెద్దలంతా ఉన్నారు. రారుసార్ రారు. తమరు రాత్రి ఉంటారుగా! చూద్దురుగాని ఒక్క గది ఖాళీగా ఉండదు సార్!" అన్నాడు రామం.

వ్యాపారం అన్ని చోట్లలాగే ఈ మారుమూల పల్లెటూళ్లోనూ జోరుగానే సాగుతున్నాది. నిర్భయంగా సజావుగా జరుగుతున్నాది.

మధ్యాహ్నం భోంచేసి బస్సుకి బయల్దేరాను. రామం బేగు పట్టుకుని అతి విచారపు మొహంతో నిలబడ్డాడు. వాడికి చాలా కించగా ఉంది. నేను వెళ్లిపోవడం వాడికి నచ్చలేదు.

"రాత్రికి ఉంటామన్నారండీ!" అన్నాడు.


"పోతాను" అన్నాను.

"నాకు తెలుసు సార్. తమరు సీత కోసం వచ్చారు. సీత మన చెయ్యి తప్పి పోయింది సార్" అన్నాడు.

చాలా సరిగ్గా అన్నాడు.

సీతే కావాలని మరొకత్తి అక్కర్లేదని తెలుసుకున్నాడు.

ఇంకెక్కడి సీత! ఇంకెక్కడి సావిత్రి!





అఫారీ ఫార్మసూటికల్స్ లిమిటెడ్, ఎ టూ జడ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, బ్లాక్ నం. ఎ/3, గణపత్‌రావ్ కదమ్ మార్గ్, లోయర్ పరేల్, బొంబాయి-400 013.
everest/82/APL/319-tl